క్లుప్తంగా

చిన్నారులకు దుస్తుల పంపిణీ



కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని కాకతీయనగర్, రాజీవ్‌నగర్‌కాలనీలోని అంగన్‌వాడి కేంద్రాలలో చిన్నారులకు ప్రభుత్వం నుంచి సరఫరా అయిన రెండు రకాల దుస్తులను సోమవారం మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ చేతుల మీదుగా పంపిణీ చేశారు. చిన్నారులకు కచ్చితంగా క్రమం తప్పకుండా పౌష్టికాహారం అందించాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి సీడీపీవో రోశిష్మ, సూపర్‌వైజర్ కవిత, అంగన్‌వాడీ టీచర్, చిన్నారులు పాల్గొన్నారు.

కౌన్సిలర్ చేతుల మీదుగా..



కామారెడ్డి రూరల్: సరంపల్లి అంగన్‌వాడి కేంద్రంలోని చిన్నారులకు సోమవారం ఏకరూప దుస్తులను కౌన్సిలర్ ఆకుల రూప రవికుమార్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు అనిల్‌కుమార్, అంగన్ సూపర్‌వైజర్ కొమురవ్వ, అంగన్‌వాడీ టీచర్ యమునాబాయి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కులు..



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను సోమవారం రెవెన్యూ అధికారులు, కాంగ్రెస్ నాయకులతో కలిసి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. మొత్తం 113 మందికి చెక్కులు మంజూరుకాగా వాటిలో 108 కల్యాణలక్ష్మి, ఐదు షాదీముబారక్ చెక్కులు న్నాయని నాగిరెడ్డిపేట తహసీల్దార్ శ్రీనివాస్‌రావు తెలిపారు. సోమవారం ఎల్లారెడ్డి మార్కెట్‌కమిటీ చైర్‌పర్సన్ రజితారెడ్డి, ఆర్‌ఐ మహ్మద్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శ్రీధర్‌గౌడ్ మండలంలోని నాగిరెడ్డిపేట, గోపాల్‌పేట గ్రామాల్లో గల లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి చెక్కులను అందజేశారు. మిగతాచెక్కులను మంగళవారం నుంచి లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పంపిణీ చేస్తామని వారు తెలిపారు. మాల్తుమ్మెద సొసైటీ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ నాగేష్, కాంగ్రెస మండల ఉపాధ్యక్షుడు లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలల తనిఖీ



నిజాంసాగర్(జుక్కల్): మండలంలోని అచ్చంపేట ఆదర్శ మోడల్, ప్రభుత్వ జూనియర్ కళాశాలను సోమవారం జిల్లా ఇంటర్ బోర్డు నోడల్ అధికారి షేక్ సలాం పరిశీలించారు. ఆయా కళాశాలల్లో విద్యార్థులకు అందుతున్న బోధన, తరగతుల నిర్వహణను తెలుసుకున్నారు. ఆయన వెంట మండల ప్రత్యేక అధికారి శ్రీపతి, మోడల్ కాలేజీ ప్రిన్సిపల్ కార్తిక సంధ్య తదితరులున్నారు.

తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం



కామారెడ్డి క్రైం: కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ తల్లి విగ్రహ రూపురేఖలు మార్చడాన్ని నిరసిస్తూ జిల్లా కేంద్రంలోని నిజాంసాగర్ చౌరస్తాలో ఉన్న తెలంగాణ తల్లి విగ్రహానికి బీఆర్‌ఎస్ నాయకులు సోమవారం పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ నేతలు మాట్లాడుతూ.. మాజీ సీఎం కేసీఆర్‌పై కక్ష సాధింపు చర్యగానే తెలంగాణ తల్లి విగ్రహ రూపురేఖలు మార్చారని ఆరోపించారు. బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు జూకంటి ప్రభాకర్ రెడ్డి, నాయకులు దశరథ్ రెడ్డి, భూంరెడ్డి, గెరిగంటి లక్ష్మీనారాయణ, నజీరొద్దిన్, కృష్ణాజీ రావు, కాసర్ల స్వామి, పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు భాను ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళాలు

మాచారెడ్డి: మండలంలోని చుక్కాపూర్ లక్ష్మీ నర్సింహ స్వామి ఆలయ అభివృద్ధి కోసం బోధన్ పట్టణానికి చెందిన లావణ్య, శ్రీనివాస్‌రెడ్డి దంపతులు రూ.19 వేల విరాళం అందించారు. హైదరాబాద్‌కు చెందిన పాతూరి శైలజ, భాస్కర్‌రెడ్డి దంపతులు రూ.5 వేల విరాళం ఇచ్చారు. ఈ సందర్భంగా అర్చకుడు శ్రీనివాసాచార్యులు దాతలకు స్వామివారి చిత్రపటాన్ని బహూకరించి సన్మానించారు.

కొండెక్కిన కోడి గుడ్డు

- దడ పుట్టిస్తున్న గుడ్ల ధర
- ప్రస్తుత ధర రూ.7 పైమాటే.. ప్రభుత్వం చెల్లించేది రూ.5
- ఏజెన్సీలపై ఒక్కో గుడ్డుపై రూ.2 ల అదనపు భారం
- భారం మోయలేమంటున్న ఏజెన్సీల నిర్వాహకులు



పెద్దకొడప్‌గల్ పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న ఏజెన్సీ కార్మికులు

పెద్దకొడప్‌గల్(జుక్కల్): మధ్యాహ్న భోజనం వంట ధరల పెంపుపై కేంద్ర విద్యాశాఖ ఇదివరకే ఉత్తర్వులు జారీ చేసినప్పటికి కోడి గుడ్డుపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని, ధర పెంచలేదని మధ్యాహ్న భోజన ఏజెన్సీ కార్మికులు గగ్గోలు పెడుతున్నారు. మధ్యాహ్న భోజన పథకం కింద 1 నుంచి 5వ తరగతుల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వండి పెట్టేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒక్కో విద్యార్థికి రూ.5.45 చొప్పున చెల్లిస్తుండగా దాన్ని రూ.6.19కి పెంచారు. 6 నుంచి 8వ తరగతుల విద్యార్థులకు రూ.8.17 చెల్లిస్తుండగా రూ.9.29కు పెంచారు. కేంద్ర ప్రభుత్వం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం చొప్పున నిధులు ఇస్తున్నాయి. 9, 10 తరగతులకు సొంత నిధులను వెచ్చిస్తూ పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తోంది. విద్యార్థుల ఆహార పట్టికలో భాగంగా సోమ, బుధ, శుక్రవారాల్లో కోడి గుడ్డుతో భోజనం వడ్డించాలి. కాని ఒక గుడ్డు రూ. 5 చొప్పున ప్రభుత్వం ఏజెన్సీలకు చెల్లిస్తోంది. ప్రస్తుతం మార్కెట్‌లో గుడ్డు ధర రూ. 7లకు పెరిగింది. ఒక విద్యార్థికి రూ. 2 వరకు అదనంగా ఏజెన్సీ కార్మికులే చెల్లించాల్సి వస్తోంది. ఈ లెక్కన ఒక్కో విద్యార్థికి వారానికి రూ.6 ల అదనపు భారం పడుతోంది. ఈ కారణంగా కోడి గుడ్డు వడ్డించలేమని ఏజెన్సీ కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పెద్దకొడప్‌గల్ పరిధిలో..

పెద్దకొడప్‌గల్ మండలంలో మూడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, 29 ప్రాథమిక పాఠశాలలున్నాయి. 32 పాఠశాలల్లో కలిపి 2,200 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఒక్కో విద్యార్థికి వారానికి రూ.6 చొప్పున నెలకు రూ.24 అవుతోంది. ఈ లెక్కన ఏజెన్సీ కార్మికులపై నెలకు సుమారుగా రూ.52,800 అదనపు భారం పడుతోంది. ఈ భారం తాము మోయలేమని, కోడిగుడ్లను ప్రభుత్వమే అందించాలని వారు కోరుతున్నారు.

మెనూ అమలు కావట్లే..

మెనూ ప్రకారం రోజూ రెండు కూరలు పెట్టాల్సి ఉండగా, ఏ స్కూల్లో కూడా రెండు కూరలు పెట్టడం లేదు. ఏజెన్సీ కార్మికులకు దీనిపై వివరణ అడగగా.. పప్పులోనే కూరగాయలను కలిపి వేస్తున్నామని సమాధానం ఇస్తున్నారు. కూరగాయలు ఎక్కువ రేటు ఉన్నా ప్రభుత్వం మాత్రం ఒకే రేటు కట్టిస్తుందని, డబ్బులు ఎక్కడ నుంచి వస్తాయని చెబుతున్నారు. ఎవ్వరూ ఉద్దర కూడా ఇవ్వడం లేదని ఏజెన్సీ కార్మికులు వాపోతున్నారు.

నెలనెలా బిల్లులు ఇప్పించండి



బిల్లులు మూడు నెలలకు ఒక్కసారి ఇస్తున్నారు. కిరాణం, కూరగాయల కోసం షాపులకు వెళ్తె ఉద్దర ఇవ్వడం లేదు. ఉద్దెర అడిగి అవమాన పడుతున్నాం. ఒక గుడ్డుకు రెండు రూపాయలు మాపై భారం పడుతుంది. ప్రభుత్వం స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

– మణెమ్మ, వంట కార్మికురాలు, వడ్లం పాఠశాల

ప్రభుత్వమే సరఫరా చేయాలి



కోడిగుడ్డు ధర పెరగడంతో మధ్యాహ్న భోజనంలో కోడిగుడ్డు పెట్టడం మాకు చాలా భారంగా మారింది. మెనూ ప్రకారం భోజనం పెట్టాలంటే ప్రభుత్వమే కోడి గుడ్లను సరఫరా చేయాలి. బిల్లులు నెల నెలా అందించేలా చూడాలని ఏజెన్సీ కార్మికులం కోరుతున్నాం.

– సావిత్రి, వంట కార్మికురాలు, పెద్దకొడప్‌గల్ ప్రాథమిక పాఠశాల

విద్యార్థులు ఒత్తిడికి గురికావొద్దు



అవగాహన కల్పిస్తున్న మానసిక వైద్య నిపుణుడు

గాంధారి(ఎల్లారెడ్డి): ఇంటర్ విద్యార్థులు ఒత్తిడికి గురికావొద్దని, దురలవాట్లకు అలవాటు పడొద్దని మానసిక వైద్య నిపుణుడు రమణ అన్నారు. సోమవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఇంటర్ విద్యార్థులకు పలు విషయాలపై అవగాహన కల్పించారు. మత్తు పదార్థాలు, గంజాయి, తదితర చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. మార్కులు తక్కువ వచ్చాయని, ఇతర కారణాలతో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక లక్ష్యం నిర్ణయించుకుని ప్రణాళిక ప్రకారం ప్రిపేర్ కావాలన్నారు. మానసికంగా ఇబ్బందిగా ఉంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నంబర్ 1441కు ఫోన్ చేయాలన్నారు. కౌన్సిలింగ్ ద్వారా సలహాలు ఇస్తారని సూచించారు. జిల్లా సోషల్ వర్కర్ రాహుల్ కుమార్, ప్రిన్సిపాల్ గంగారాం, విద్యార్థులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి అపూర్వ స్పందన



సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో సోమవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన డయాబెటీస్ శిబిరానికి అపూర్వ స్పందన లభించినట్లు క్లబ్ అధ్యక్షుడు కొప్పుల నర్సారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా 46 మందికి వైద్య పరీక్షలు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ గాదారి శ్రీనివాస్ రెడ్డి, విండో చైర్మన్ కమలాకర్ రావు, ట్రెజరర్ వైట్ల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు చిట్టెపు రాములు, నారాయణ, డైరెక్టర్లు శ్రీనివాస్, ప్రతినిధులు నల్ల రాంరెడ్డి, రాజేందర్, గంగారెడ్డి పాల్గొన్నారు.

రుణమాఫీని పూర్తిస్థాయిలో అమలు చేయాలి



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీ ప్రకారం రూ.2 లక్షల రుణమాఫీని పూర్తిస్థాయిలో అమలు చేయాలని భారతీయ కిసాన్ సంఘ్ నాగిరెడ్డిపేట మండల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు నాగిరెడ్డిపేట తహసీల్దార్ శ్రీనివాస్‌రావుకు సోమవారం వారు వినతిపత్రాన్ని అందజేశారు. రైతుభరోసాతోపాటు పంటల భీమా పథకాన్ని అమలు పర్చాలని వారు డిమాండ్ చేశారు. బీకేఎస్ మండలాధ్యక్షుడు కాంత్ రెడ్డి, నాయకులు రాజిరెడ్డి, బీరయ్య, రాజు, నారాయణరెడ్డి, వుంకట్ రాంరెడ్డి, లింగయ్య పాల్గొన్నారు.

'కాంగ్రెస్‌ది మోసాల చరిత్రే'



రామారెడ్డిలో మాట్లాడుతున్న సామ్యెల్ మాదిగ

రామారెడ్డి: దేశాన్ని అనేక ఏండ్లుగా పాలించిన కాంగ్రెస్ పార్టీ ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు చట్టబద్ధత కల్పించకుండా సామాజిక న్యాయానికి విరుద్ధంగా వ్యవహరించి మాదిగ జాతి, ఉపకులాల పట్ల మోసాలకు పాల్పడిందని కామారెడ్డి జిల్లా పర్యవేక్షకులు మంథని సామ్యెల్ మాదిగ విమర్శించారు. సోమవారం మండల కేంద్రంలో సామ్యెల్ మాట్లాడుతూ.. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ చేసే హక్కు అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు ఉందని గత ఆగస్టు 1న సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ఇప్పటి వరకూ అమలు చేయకుండా రేవంత్ రెడ్డి ప్రభుత్వం కాలయాపన చేస్తున్నదని, దానికి ప్రతీకారం తప్పదని హెచ్చరించారు. రామారెడ్డిలో ఎమ్మార్పీఎస్ అనుబంధ విభాగాల మండల ర్యాలీ, సదస్సు, నిర్వహించారు.అనంతరం నూతన కమిటీలను ఏర్పాటు చేశారు. నాయకులు బట్టు వెంకటరాములు మాదిగ, మహిళా విభాగం జిల్లా అధ్యక్షులు సట్టిగారి లక్ష్మి మాదిగ, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సోనియా గాంధీ జన్మదిన వేడుకలు



బాన్సువాడలో కేక్ కట్ చేస్తున్న డీసీసీబీ మాజీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్



రామేశ్వర్‌పల్లిలో వృద్ధురాలికి కేకు తినిపిస్తున్న గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి

కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు సోనియా గాంధీ జన్మదిన వేడుకలను సోమవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు పార్టీ కార్యాలయాల్లో కేకులు కోసి సంబరాలు చేసుకున్నారు. పలు ఆస్పత్రుల్లో పండ్లు, బ్రెడ్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. అనంతరం కాంగ్రెస్ నేతలు మాట్లాడుతూ.. సోనియా గాంధీ చొరవతోనే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు సాకారమైందని గుర్తు చేశారు. – సాక్షి నెట్‌వర్క్



నాగిరెడ్డిపేటలో..



జుక్కల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో..

మున్సిపల్ ఆధ్వర్యంలో క్రికెట్ లీగ్



కామారెడ్డి టౌన్: మున్సిపల్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో సోమవారం క్రికెట్ లీగ్ పోటీలను నిర్వహించారు. విన్నర్‌గా వాటర్ వర్క్స్ విభాగం, రన్నరప్‌గా శానిటేషన్ విభాగం జట్లు నిలిచాయి. చైర్‌పర్సన్ వారికి జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, అధికారులు, ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

సౌత్‌క్యాంపస్ విద్యార్థుల క్షేత్రస్థాయి పర్యటన



భిక్కనూరు: తెలంగాణ యూనివర్సిటీ సౌత్ క్యాంపస్ సోషల్ వర్కు డిపార్టుమెంట్‌కు చెందిన ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా నిజామాబాద్‌లోని స్నేహ సొసైటీ స్వచ్ఛంద సంస్థ, కేంద్ర ప్రభుత్వ శిశుగృహ కేంద్రాలను సందర్శించారు. ఈ సంస్థల్లో దివ్యాంగులకు అందుతున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. అధ్యాపకుడు డాక్టర్ యాలాద్రి, స్నేహ స్వచ్ఛంద సంస్థ చైర్మన్ జ్యోతి, శిశు గృహ కేంద్రం మేనేజర్ అనిత, డీసీపీవో చైతన్య కులకర్ణి, సోషల్‌వర్కర్ అనిల్ పాల్గొన్నారు.

ప్రజాపాలన సంబురాలు



బాన్సువాడ రూరల్: తెలంగాణ ప్రజాపాలన సంబురాలు బాన్సువాడలో కొనసాగుతున్నాయి. సంబురాల్లో భాగంగా అధికారులు మండల కేంద్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలను విద్యుత్‌దీపాలతో సుందరంగా అలంకరించారు. బాన్సువాడ మున్సిపాలిటీ, సబ్‌కలెక్టర్ కార్యాలయం, ఏఎంసీ, ఐకేపీ తదితర కార్యాలయాలను విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు.

'అంగవైకల్యం శరీరానికే మనసుకు కాదు'



నస్రుల్లాబాద్(బాన్సువాడ): అంగవైకల్యం శరీరానికే కాని మనసుకు కాదు అని పీఆర్‌టీయూ మండల అధ్యక్షులు గునిగెరి హన్మాండ్లు అన్నారు. దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని నస్రుల్లాబాద్ ప్రాథమిక పాఠశాలలో గల భవిత కేంద్రంలో దివ్యాంగ విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈవో చందర్ మాట్లాడుతూ.. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ స్వప్న, ఐఈఆర్‌పీ రూప, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నాగిరెడ్డిపేటలో అంబులెన్స్ ప్రారంభం



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి కేటాయించిన 108 అంబులెన్స్‌ను సోమవారం కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శ్రీధర్ గౌడ్ జెండా ఊపి ప్రారంభించారు. అత్యవసర సమయాల్లో మండల ప్రజలు 108 అంబులెన్స్‌ను వినియోగించుకోవాలని ఆయన కోరారు. ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రజితారెడ్డి, తాండూర్ సొసైటీ చైర్మన్ గంగారెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ నాగేష్, మాల్తుమ్మెద సొసైటీ మాజీ చైర్మన్ రాంచందర్‌రెడ్డి, పీహెచ్‌సీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచుల ముందస్తు అరెస్ట్



భిక్కనూరు పోలీస్ స్టేషన్‌లో ఉన్న మండల మాజీ సర్పంచ్‌లు



ఎల్లారెడ్డి పోలీస్ స్టేషన్‌లో..

జిల్లాలో పలు చోట్ల మాజీ సర్పంచ్‌లను సోమవారం ముందస్తు అరెస్ట్ చేశారు. పెండింగ్ బిల్లులను చెల్లించాలని డిమాండ్ చేస్తూ అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి మాజీ సర్పంచ్‌లు పిలుపునివ్వడంతో పోలీసులు వారిని స్థానిక పోలీస్‌స్టేషన్లకు తరలించారు. అనంతరం సొంత పూచీకత్తుపై వారిని విడుదల చేశారు. – భిక్కనూరు/ఎల్లారెడ్డి

సమాచారం..

నేటి నుంచి సీఎం కప్ ఆటల పోటీలు

నస్రుల్లాబాద్/సదాశివనగర్/తాడ్వాయి/మద్నూర్/గాంధారి: సీఎం కప్ మండల స్థాయి క్రీడా పోటీలు మంగళవారం(నేడు) నుంచి ప్రారంభమవుతున్నట్లు నస్రుల్లాబాద్, సదాశివనగర్, తాడ్వాయి, మద్నూర్, గాంధారి మండలాల ఎంపీడీవోలు సూర్యకాంత్, సంతోష్ కుమార్, సయ్యద్ సాజిద్ అలీ, నాగరాజు, లక్ష్మీనారాయణలు వేర్వేరుగా తెలిపారు. ఈ క్రీడల్లో ఉత్తమ ప్రతిభ చూపిన వారిని జిల్లా స్థాయికి పంపించనున్నట్లు వారు పేర్కొన్నారు.

నేడు కృత్రిమ అవయవాల పంపిణీ

నస్రుల్లాబాద్(బాన్సువాడ): నెమ్లి గ్రామ షిర్డీ సాయి ఆలయంలో మంగళవారం కృత్రిమ అవయవాల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు నందు రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఆలయ ధర్మకర్త పట్లోళ్ల మోహన్ రెడ్డి(ఎన్‌ఆర్‌ఐ) దివ్యాంగులకు వాహనాలు, అవయవాలను అందించాలని నెల రోజుల క్రితం ఎంపిక కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 165 మంది దివ్యాంగులను ఎంపిక చేశామన్నారు. రూ.కోటి 50 లక్షల విలువ చేసే 55 ట్రై సైకిళ్లు, 110 మందికి జైపూర్ ఫుట్, చేయి, చేతి కర్రలు పంపిణీ చేస్తున్నామన్నారు. లబ్ధిదారులు షిర్డీ సాయి కల్యాణ మండపానికి వచ్చి తీసుకోవాలని తెలిపారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో..

కామారెడ్డి అర్బన్: నిజామాబాద్ రోటరీ క్లబ్, రోటరీ సర్వీస్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 10న మంగళవారం ఉదయం 10.30 గంటల నుంచి నిజామాబాద్ బర్కత్‌పురలోని రోటరీ కృత్రిమ అవయవ కేంద్రంలో ఉచిత కృత్రిమ కాలు(జైపూర్ ఫుట్) పంపిణీ శిబిరం నిర్వహిస్తున్నారని రోటరీ క్లబ్ కామారెడ్డి అధ్యక్షుడు పి.రాజనర్సింహారెడ్డి తెలిపారు. వివరాలకు 92469 90055కు సంప్రదించాలని సూచించారు.

22న జిల్లా స్థాయి గణిత ప్రతిభా పరీక్ష

బాన్సువాడ రూరల్/కామారెడ్డి రూరల్: భారతీయ గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకుని ఈ నెల 22న జిల్లా స్థాయి గణిత ప్రతిభా పరీక్ష నిర్వహించనున్నట్లు గణిత ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నీలం కుమారస్వామి, రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు తాడ్వాయి శ్రీనివాస్‌లు వేర్వేరుగా తెలిపారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ గంజ్ ఉన్నత పాఠశాలలో ఉదయం 11 గంటలకు పరీక్ష ఉంటుందన్నారు. మండల స్థాయిలో ఎంపికైన విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రానికి చేరుకుని అత్యుత్తమ ప్రతిభతో రాష్ట్ర స్థాయికి ఎంపిక కావాలన్నారు. గణితఫోరం కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్, గణిత ఉపాధ్యాయులు నరేందర్, రామారావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

రత్నాపూర్‌లో 100 శాతం విద్యుత్ చార్జీల వసూలు



ఎల్లారెడ్డిరూరల్: రత్నాపూర్ గ్రామంలోని రైతులకు సంబంధించిన వ్యవసాయ బోరుబావులకు సంబంధించిన బిల్లులు వంద శాతం వసూలు చేసినట్లు ఫోర్‌మాన్ గంగాధర్ సోమవారం తెలిపారు. గ్రామంలోని 60 వ్యవసాయ బోరు బావులకు సంబంధించిన 24 వేల 416 రూపాయల విద్యుత్ బిల్లులు రైతులు చెల్లించినట్లు పేర్కొన్నారు. లైన్ మెన్ బాలకిషన్, సిద్దేందర్‌రెడ్డి తదితరులున్నారు.

ఫంక్షన్ హాలు నిర్మాణ పనుల పరిశీలన



బీబీపేట: మండల కేంద్రంలోని గౌడ సంఘం సభ్యులకు ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి ఇచ్చిన హామీ మేరకు సోమవారం ఫంక్షన్ హాలు నిర్మాణ పనులు ప్రారంభించారు. బీజేపీ మండలాధ్యక్షుడు రంజిత్‌గౌడ్ పనులను పరిశీలించారు. గతంలో గౌడ సంఘం సభ్యులకు మాట ఇచ్చి పనులు చేయడంతో కుల సంఘం సభ్యులు ఆయనకు ధన్యవాదాలు తెలియజేశారు.

సమస్యలు తీర్చాలని ఫిర్యాదు




తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో సోమవారం తమ సమస్యలు తీర్చాలని కోరుతూ గ్రామ కార్యదర్శులు ఎంపీడీవో సయ్యద్ సాజిద్‌అలీకి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ కార్యదర్శులు మాట్లాడుతూ.. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యలు పరిష్కారమయ్యేలా కృషిచేయాలన్నారు. కార్యదర్శులు బాలు, అశోక్, అనీల్, చంద్రకళ, విక్రాంత్, శ్రీనివాస్, రేణుక, హారిక, అనిత, ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టీల్ ప్లేట్ల పంపిణీ

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో సింగరాయపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 110 మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజనం చేయడానికి స్టీల్ ప్లేట్లను అందజేసినట్లు క్లబ్ అధ్యక్షుడు పి.రాజనర్సింహారెడ్డి తెలిపారు. క్లబ్ కోశాధికారి సబ్బని కృష్ణహరి, ప్లేట్ల దాత సీహెచ్.కాశీనాథ్‌రావు, కె.కాశీనాథం, కె.భాస్కర్, ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల హెడ్‌మాస్టర్లు శ్రీపతి, సత్య ప్రసాద్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

అనుమతి లేని దుకాణాల మూసివేత



భిక్కనూరు: మండలంలోని జాతీయ రహదారి పక్కన నేషనల్ హైవే అథారిటీ, గ్రామపంచాయతీ అనుమతి లేకుండా నిర్వహిస్తున్న వ్యాపార దుకాణాలను భిక్కనూరు ఎస్సై సాయికుమార్ ఆధ్వర్యంలో సోమవారం మూసి వేయించారు. వీటి వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్న విషయాన్ని ఆ వ్యాపార దుకాణాల యజమానులు, నిర్వాహకులకు నోటీసులను అందజేసి మూసివేయించినట్లు ఎస్సై వివరించారు. భిక్కనూరు జీపీ ఈవో మహేష్‌గౌడ్‌తో పాటు నేషనల్ హైవే సిబ్బంది ఉన్నారు.